రూ.2.69 లక్షల కోట్లు

- 2024-25కుగాను కేంద్రప్రభుత్వానికి ఆర్బీఐ డివిడెండ్
- భారతీయ రిజర్వ్ బ్యాంక్ చరిత్రలోనే అత్యధికం
- మోదీ హయాంలో ఇప్పటికే ఖజానాకు చేరిన రూ.లక్షల కోట్లు
- 2014-15 నుంచి రూ.11.55 లక్షల కోట్ల డివిడెండ్

ముంబై, మే 23: కేంద్ర ప్రభుత్వానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) నుంచి రికార్డు స్థాయిలో డివిడెండ్ అందుతున్నది. గత ఆర్థిక సంవత్సరానికి (2024-25)గాను శుక్రవారం ఏకంగా రూ.2.69 లక్షల కోట్ల డివిడెండ్‌ను సెంట్రల్ బ్యాంక్ ప్రకటించింది. భారతీయ రిజర్వ్ బ్యాంక్ చరిత్రలోనే ఇది అత్యధికం కావడం గమనార్హం. ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా నేతృత్వంలో జరిగిన కేంద్ర బోర్డు డైరెక్టర్ల 616వ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. నిజానికి అంతకుముందు ఆర్థిక సంవత్సరానికి (2023-24) సంబంధించే రికార్డు స్థాయిలో ఆర్బీఐ నుంచి ఖజానాకు డివిడెండ్ చేరింది. మునుపెన్నడూ లేనివిధంగా ఆ ఏడాదికి రూ.2.11 లక్షల కోట్లు చెల్లించింది మరి. ఇప్పటిదాకా ఇదే ఆల్‌టైమ్ హై. కానీ ఇప్పుడు దానికంటే 27.40 శాతం అధికంగా మోదీ సర్కారుకు డివిడెండ్ వెళ్తుండటం విశేషం.

ఈసీఎఫ్ ఆధారంగా..

ఏటా ఆర్బీఐ మిగులు నగదు నిల్వల నుంచి కేంద్ర ప్రభుత్వానికి ఎంతోకొంత డివిడెండ్ రూపంలో వెళ్తుంది. ఈ డివిడెండ్ ఆర్బీఐ ఎకనామిక్ క్యాపిటల్ ఫ్రేమ్‌వర్క్ (ఈసీఎఫ్)పై ఆధారపడి ఉంటుంది. ఆర్బీఐ మాజీ గవర్నర్ బిమల్ జలాన్ నాయకత్వంలోని నిపుణుల కమిటీ నివేదిక ఆధారంగా 2019 ఆగస్టులో ఈసీఎఫ్‌ను డివిడెండ్‌కు ప్రామాణికంగా ఆర్బీఐ తీసుకున్నది. ఆర్బీఐ బ్యాలెన్స్ షీట్‌లో కంటింజెంట్ రిస్క్ బఫర్ (సీఆర్‌బీ) 5.5 శాతం నుంచి 6.5 శాతంగా ఉండాలని కమిటీ సూచించింది. అయితే ఈ నెల 15న జరిగిన సమావేశంలో ఈసీఎఫ్‌ను ఆర్బీఐ సమీక్షించింది. సీఆర్‌బీని 7.50 శాతానికి పెంచింది. ఈ క్రమంలోనే ఆర్బీఐ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు గత ఆర్థిక సంవత్సరానికి గాను రికార్డు స్థాయిలో రూ.2,68,590.07 కోట్ల డివిడెండ్‌ను కేంద్రానికి ముట్టజెప్పేందుకు ఆమోదం తెలిపారు. ఈ మేరకు ఆర్బీఐ ఓ తాజా ప్రకటనలో స్పష్టం చేసింది.

పటేల్‌తో గొడవే ఇది..

అప్పట్లో ఆర్బీఐ గవర్నర్‌గా రఘురామ్ రాజన్ మూడేండ్లకే పరిమితం కావడం, ఆ తర్వాత వచ్చిన ఊర్జిత్ పటేల్ మధ్యలోనే వెళ్లిపోవడం.. అంతా కూడా రిజర్వ్ బ్యాంక్‌పై పెరిగిన కేంద్రం పెత్తనం వల్లేనన్న ఆరోపణలున్నాయి. ముఖ్యంగా ఆర్బీఐ మిగులు నగదు నిల్వలను ఖజానాకు తరలించాలన్న మోదీ సర్కారు ఎత్తుగడను పటేల్ అడ్డుకున్నారని, ఇది ఆర్బీఐ ఉనికికే ప్రమాదమని ఆయన ఆందోళన వ్యక్తం చేశారని అంటారంతా. ఆర్బీఐ బలహీనపడితే దేశ బ్యాంకింగ్ వ్యవస్థకు, చివరకు యావత్తు ఆర్థిక వ్యవస్థకే ముప్పని ఆవేదన చెందారని కూడా చెప్తారు. అయినప్పటికీ ఏదీ ఆగకపోవడంతో తుదకు పటేల్ అర్ధాంతరంగా రాజీనామా చేసి వెళ్లిపోయారన్న అభిప్రాయాలున్నాయి. ఈ క్రమంలో ఏరికోరి శక్తికాంత దాస్‌ను ఆర్బీఐ అధిపతిగా చేసింది మోదీ సర్కారు. పెద్ద ఎత్తున డివిడెండ్లు ప్రకటిస్తూపోయిన ఆయన తన హయాంలో చివరి ఆర్థిక సంవత్సరానికి (2023-24)గాను ఎప్పుడూ లేనంతగా రూ.2,11,000 కోట్ల డివిడెండ్ ప్రకటించేశారు. దాస్ తదుపరి వచ్చిన మల్హోత్రా సైతం ఆర్బీఐ గవర్నర్‌గా తన తొలి ఏడాదిలోనే అంతకుమించి డివిడెండ్ ఇచ్చి కొత్త రికార్డును నెలకొల్పారు.

సర్కారుకు జోష్

పాకిస్థాన్‌తో ఘర్షణ వాతావరణం, అమెరికా ప్రతీకార సుంకాల నేపథ్యంలో ఆర్బీఐ కేంద్ర ప్రభుత్వానికి రికార్డు స్థాయి డివిడెండ్ ప్రకటించడం మిక్కిలి ప్రాధాన్యతను సంతరించుకుంటున్నదిప్పుడు. భారత రక్షణ వ్యవస్థ బలోపేతం కావాలన్న ఆకాంక్షలు ఓ వైపు, ట్రంప్ టారిఫ్‌లతో ఎదురవుతున్న సవాళ్లను అధిగమించే దిశగా అడుగులు వేయాలన్న అభిప్రాయాలు మరోవైపు గట్టిగా వినిపిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆర్బీఐ భారీ డివిడెండ్ వెనుక మోదీ సర్కారు ఒత్తిళ్లు ఏమైనా ఉన్నాయా? అన్న సందేహాలు కలుగుతుండటం గమనార్హం.



తగ్గిన ఫారెక్స్ నిల్వలు

ఈ నెల 16తో ముగిసిన వారంలో దేశంలోని విదేశీ మారకపు నిల్వలు 4.888 బిలియన్ డాలర్లు పడిపోయాయి. ఈ మేరకు ఆర్బీఐ తెలియజేసింది. దీంతో మొత్తం ఫారెక్స్ రిజర్వులు 685.729 బిలియన్ డాలర్లకు దిగజారిపోయాయి. అంతకుముందు వారం 4.553 బిలియన్ డాలర్లు పెరిగి 690.617 బిలియన్ డాలర్లుగా ఉన్న విషయం తెలిసిందే. కాగా, గత ఏడాది సెప్టెంబర్‌లో ఆల్‌టైమ్ హైని తాకుతూ 704.885 బిలియన్ డాలర్లకు భారత డాలర్ నిల్వలు చేరాయి.

తొలి యాపిల్ ప్రీమియం స్టోర్

హైదరాబాద్, మే 23: యాపిల్‌కు సంబంధించిన ఉత్పత్తుల విక్రయ సంస్థ అప్‌ట్రానిక్స్..హైదరాబాద్‌లో తొలి యాపిల్ ప్రీమియం స్టోర్‌ను ప్రారంభించింది. ఈ స్టోర్‌లో యాపిల్‌కు సంబంధించిన ఐఫోన్ల తోపాటు మ్యాక్‌బుక్స్, ఐప్యాడ్స్, ఇతర విడిభాగాలు కూడా లభించనున్నాయి. ఈ స్టోర్ ప్రారంభ సందర్భంగా కనీసంగా 12 శాతం వరకు రాయితీ ఇస్తున్నట్లు ప్రకటించింది. దీంతోపాటు యాపిల్ కేర్ సర్వీసులపై 50 శాతం తగ్గింపు ధరతోపాటు పాత స్మార్ట్‌ఫోన్ లేదా ల్యాప్‌టాప్ ఎక్స్ఛేంజ్‌పై రూ.10 వేల వరకు బోనస్‌ను పొందవచ్చునని అప్‌ట్రానిక్స్ ఫౌండర్ సుతిందర్ సింగ్ తెలిపారు.

ఎంటార్ ఆశాజనకం

హైదరాబాద్, మే 23: ఎంటార్ అంచనాలకుమించి రాణించింది. గడిచిన ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికానికిగాను రూ.13.72 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని గడించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.4.87 కోట్లతో పోలిస్తే రెండురెట్లు పెరిగినట్టు వెల్లడించింది. ప్రస్తుతం కంపెనీ చేతిలో రూ.979.4 కోట్ల విలువైన ఆర్డర్లు ఉన్నాయి. గడిచిన ఆర్థిక సంవత్సరం మొత్తానికి రూ.664.65 కోట్ల ఆదాయంపై రూ.52.89 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసుకున్నది.

పియర్సన్ టెస్టింగ్ సెంటర్

హైదరాబాద్, మే 23: ప్రముఖ టెక్నాలజీ సేవల సంస్థ పియర్సన్..హైదరాబాద్‌లో టెస్టింగ్ సెంటర్‌ను నెలకొల్పింది. తెలంగాణలో వ్యూహాత్మక విస్తరణలో భాగంగా ఈ సెంటర్‌ను నెలకొల్పినట్టు, ఇప్పటికే వందకు పైగా ఇనిస్టిట్యూట్‌లతో ఒప్పందం చేసుకొని నైపుణ్యాభివృద్ధి సేవలు అందిస్తున్నట్టు కంట్రీ హెడ్ వినయ్ తెలిపారు. బీటెక్ కోర్సులు, అండర్ గ్రాడ్యుయేట్, మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కోర్సులకు అవసరమైన కంటెంట్ అందిస్తున్నది. ఇప్పటికే బెంగళూరు, చెన్నైలలో 1,300 మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు.

నష్టాల్లో జీఎమ్మార్ ఎయిర్‌పోర్ట్స్

హైదరాబాద్, మే 23: జీఎమ్మార్ ఎయిర్‌పోర్ట్స్ నష్టాల పరంపర కొనసాగుతున్నది. గడిచిన ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికానిగాను సంస్థ రూ.253 కోట్ల కన్సాలిడేటెడ్ లాస్ వచ్చినట్టు ప్రకటించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో వచ్చిన రూ.168 కోట్లతో పోలిస్తే భారీగా పెరిగింది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం రూ.2,570 కోట్ల నుంచి రూ.2,977 కోట్లకు ఎగబాకింది. ప్రస్తుతం సంస్థ ఢిల్లీ, హైదరాబాద్, మోపా(గోవా) ఎయిర్‌పోర్ట్‌లను నిర్వహిస్తున్నది.

ఎయిర్ ఇండియా సమ్మర్ సేల్

న్యూఢిల్లీ, మే 23: విమానయాన సంస్థ ఎయిర్ ఇండియా..సమ్మర్ సేల్ పేరుతో ప్రత్యేక ఆఫర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ ఆఫర్ కింద ఒకవైపు దేశవ్యాప్తంగా ప్రారంభ విమాన టికెట్ ధరను రూ.1,199గా నిర్ణయించిన సంస్థ..అంతర్జాతీయ రూట్లలో రూ.11,969గా నిర్ణయించింది. ఈ నెల 25 అర్ధరాత్రి వరకు అందుబాటులో ఉండనున్న ఈ ప్రత్యేక ఆఫర్ కింద బుకింగ్ చేసుకున్న ప్రయాణికులు సెప్టెంబర్

30లోగా, అంతర్జాతీయ రూట్లలో డిసెంబర్ 10లోగా ప్రయాణించాల్సి వుంటుందని పేర్కొంది. ఎయిర్ ఇండియా వెబ్‌సైట్, మొబైల్ యాప్ ద్వారా బుకింగ్ చేసుకున్నవారికి మాత్రమే ఈ ఆఫర్ వర్తించనున్నదని తెలిపింది.

సుజుకీ తొలి ఈ-స్కూటర్

ముంబై, మే 23: ప్రముఖ ద్విచక్ర వాహన సంస్థ సుజుకీ మోటర్‌సైకిల్..దేశీయ మార్కెట్‌కు తన తొలి ఈ-స్కూటర్ ఈ-యాక్సెస్‌ను అందుబాటులోకి తీసుకురావడానికి సిద్ధమైంది. ఈ ఏడాది జనవరిలో జరిగిన భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో-2025లో ప్రదర్శించిన ఈ వాహనాన్ని గురుగ్రామ్‌లో ఉన్న తన ప్లాంట్లో ఉత్పత్తిని ప్రారంభించింది. సుజుకీ ఈ-టెక్నాలజీ, లిథియం-ఐరన్-ఫాస్ఫేట్ బ్యాటరీ వంటి ఫీచర్స్‌తో తయారు చేసింది.

గవర్నర్‌ను కలిసిన ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి

హైదరాబాద్, మే 23 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయ వీసీ ఆచార్య ఘంటా చక్రపాణి రాజ్‌భవన్‌లో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గవర్నర్‌కు వర్సిటీలో జరుగుతున్న అభివృద్ధి పనులను వివరించారు. ఆగస్టు లేదా సెప్టెంబర్‌లో జరగనున్న వర్సిటీ 26వ స్నాతకోత్సవానికి అనుమతి కోరడంతో పాటు కార్యక్రమానికి హాజరవ్వాలని ఆహ్వానించారు. గవర్నర్‌ను కలిసిన వారిలో రిజిస్ట్రార్ డా ఎల్ విజయకృష్ణారెడ్డి, పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ భోజా శ్రీనివాస్, ప్రజా సంబంధాల అధికారి డా పీ వేణుగోపాల్‌రెడ్డి ఉన్నారు.

గాజాపై ఇజ్రాయెల్ దాడుల్లో 60 మంది మృతి

గాజా స్ట్రిప్ : గాజా స్ట్రిప్‌పై ఇజ్రాయెల్ దాడులు మరింత పెరిగాయి. దీంతో 24 గంటల వ్యవధిలో సుమారు 60 మంది మరణించారు. వీరు ఖాన్ యూనిస్, డెయిర్ అల్-బలాహ్ పట్టణాలు, జబలియా శరణార్థుల శిబిరాలకు చెందినవారు. గాజా హెల్త్ మినిస్ట్రీ శుక్రవారం ఈ వివరాలను తెలిపింది. హమాస్ నిర్బంధంలో ఉన్న 58 మంది ఇజ్రాయెలీలను విడుదల చేసే వరకు, హమాస్ ఆయుధాలను వదిలిపెట్టే వరకు ఈ దాడులు కొనసాగుతాయని ఇజ్రాయెల్ స్పష్టం చేసింది. ఇదిలా వుండగా, గాజాలోకి మానవతా సాయాన్ని అనుమతించేందుకు అంతర్జాతీయ ఒత్తిళ్ల మేరకు ఇజ్రాయెల్ అంగీకరించింది. గోధుమ పిండి, ఆహారం, ఔషధాలు, వైద్య పరికరాలతో 100కుపైగా లారీలను అనుమతించింది. ఇది సరిపోదని ఐక్య రాజ్య సమితి ఏజెన్సీలు చెప్తున్నాయి.

18 ఏండ్ల లోపు పిల్లలకు ఎనర్జీ డ్రింక్స్‌పై రష్యా నిషేధం

మాస్కో: ఎనర్జీ డ్రింక్స్‌ను తాగడం వల్ల బాలలకు గుండె జబ్బుల ముప్పు ఉంటుందని అధ్యయనాలు వెల్లడించినట్లు రష్యా హెచ్చరించింది. 18 ఏళ్ల లోపు వయసు గల బాలలు వీటిని తాగరాదని తెలిపింది. ఈ మేరకు గురువారం ఓ చట్టాన్ని ఆమోదించింది. ఈ చట్టాన్ని ఉల్లంఘించే బాలలకు రూ.30,000 నుంచి రూ.53,000 వరకు జరిమానా విధించనున్నట్లు తెలిపింది. అదే విధంగా ఈ చట్టాన్ని ఉల్లంఘించే అధికారులకు రూ.1 లక్ష నుంచి రూ.2 లక్షల వరకు; లీగల్ ఎంటిటీస్‌కు రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు జరిమానా విధిస్తామని పేర్కొంది.

ఈయూకు ట్రంప్ షాక్

వాషింగ్టన్, మే 23: యూరోపియన్ దేశాలకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ షాకిచ్చారు. ఆయా దేశాల నుంచి దిగుమతి చేసుకోనున్న వస్తువులపై 50 శాతం సుంకం విధిస్తామని, జూన్ 1 నుంచి ఈ కొత్త టారిఫ్‌లు అమలులోకి రానున్నట్లు పేర్కొన్నారు. సుంకాల విధింపుపై ఆయా దేశాలతో జరిపిన చర్చలు విఫలంకావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు.

మొక్కల పథకానికి మంగళం!

- వనమహోత్సవం రద్దు కోసం సర్కారు కుంటిసాకులు
- స్థలాల కొరత ఉందని కారణాలు చెప్తున్న అధికారులు
- కేసీఆర్ పథకాలు లేకుండా చేయాలన్నదే రేవంత్ ప్లాన్
- అందుకే మొక్కలు నాటే లక్ష్యం 18 కోట్లకు కుదింపు
- మండిపడుతున్న ప్రతిపక్ష నేతలు, పర్యావరణవేత్తలు

హైదరాబాద్, మే 23 (నమస్తే తెలంగాణ): తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ ఎంతో ముందు చూపుతో ప్రవేశ పెట్టిన పథకాలను నామరూపాలు లేకుండా చేయడానికి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కుట్రలు పన్నుతున్నదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇందులో భాగంగానే పలు పథకాలను అటకెక్కించిందని బీఆర్ఎస్ నేతలు చెప్తున్నారు. ఇప్పుడు ఆ జాబితాలో హరితహారం కార్యక్రమాన్ని కూడా చేర్చారని మండిపడుతున్నారు. 2015లో కేసీఆర్ దార్శనికతతో అమల్లోకి తెచ్చిన 'హరితహారం' పథకానికి మంగళం పాడడం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎత్తులు వేస్తున్నదని విమర్శిస్తున్నారు. వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటేందుకు ప్రభుత్వ స్థలాలు కనిపించడం లేదంటూ ప్రభుత్వం సాకులు చెప్పడమే ఇందుకు నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమం ఎప్పటి నుంచి ప్రారంభమవుతుందో కూడా ప్రభుత్వం షెడ్యూల్ రూపొందించకపోవడం సర్కారు పెద్దల నిర్లక్ష్యానికి నిదర్శమని చెప్తున్నారు.

లక్ష్యం ఎందుకు తగ్గించినట్టు?

రాష్ట్రంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏటా దాదాపు 35 కోట్ల మొక్కలు నాటాల్సి ఉంది. కానీ ఈ సారి కేవలం 18 కోట్ల మొక్కలు నాటుతామని అటవీశాఖ అధికారులు చెప్తున్నారు. కానీ 16 కోట్ల మొక్కలతో సరిపెట్టే అవకాశాలు ఉన్నట్టు మరికొందరు అధికారులు వాపోతున్నారు. పథకాన్ని పూర్తిగా రద్దు

చేయడం కోసమే కొంచెం కొంచెం లక్ష్యాన్ని తగ్గిస్తూ వస్తున్నారని ప్రతిపక్షనేతలు ఆరోపిస్తున్నారు. ఈ ఏడాది వార్షిక బడ్జెట్‌లో వనమహోత్సవానికి ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడమే ఇందుకు నిదర్శనమని చెప్తున్నారు.

కేసీఆర్ ఆనవాళ్లు... పచ్చని చెట్లు

కేసీఆర్ పదేండ్ల పాలనలో 'హరితహారం'లో రూ.10,822 కోట్లు ఖర్చుపెట్టి 273.33 కోట్ల మొక్కలు నాటి దేశంలోనే ఘన చరిత్ర సృష్టించారు. అటవీ పార్కులు, ప్రభుత్వ స్థలాలు, స్కూళ్లు, కాలేజీలు, రహదారుల పక్కన మొక్కలు నాటించారు. 10,822 నర్సరీలు, 19,472 పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేశారు. 1,00,691 కిలోమీటర్ల రహదారులతో పాటు 12,000 కిలోమీటర్ల మేర బహుళ రహదారి వనాలు పెంచారు. నేడు అవన్నీ ఏపుగా పెరిగాయి. పల్లెలు, పట్టణాల్లో ఎక్కడ చూసినా కేసీఆర్ పాలనకు ఆనవాళ్లుగా చెట్లు దర్శనమిస్తున్నాయి. కానీ హరితహారం, వనమహోత్సవం అంటే కేసీఆర్ పేరే ప్రజలకు గుర్తుకు వస్తుందని, కేసీఆర్‌కు పేరు రావొద్దనే ఉద్దేశంతోనే పథకాన్ని నీరుగారుస్తున్నారని బీఆర్ఎస్ నేతలు మండిపడుతున్నారు. రాజకీయకక్ష సాధింపుల కోసం పచ్చదనంపై పగబట్టడం సరికాదని పర్యావరణవేత్తలు హితవు పలుకుతున్నారు.

'పరమేశ్వరపై కాంగ్రెస్ నేతలే ఫిర్యాదు చేశారు'

బెంగళూరు: కర్ణాటక కాంగ్రెస్‌లో వర్గ పోరు జరుగుతున్నదని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి చెప్పారు. బంగారం అక్రమ రవాణా కేసులో రాష్ట్ర హోం మంత్రి జీ పరమేశ్వరకు చెందిన విద్యా సంస్థలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దాడుల నేపథ్యంలో కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలను ప్రహ్లాద్ తిప్పికొట్టారు. కాంగ్రెస్ పార్టీలోని వారే ఈడీకి ఫిర్యాదులు చేశారని చెప్పారు. కాంగ్రెస్‌లోని కొందరు నేతలు పరమేశ్వరకు వ్యతిరేకంగా సమాచారాన్ని ఇస్తూనే, నాటకాలు ఆడుతున్నారని పేర్కొన్నారు. ఆయనపై ఫిర్యాదులు

పంపిస్తుండటం గురించి ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు తెలుసునని చెప్పారు. ఆయన పరిధిలోనే నిఘా విభాగం ఉందని, ఆయనను అడగాలని సలహా ఇచ్చారు. బంగారం అక్రమ రవాణా కేసులో నిందితురాలు రన్యా రావు క్రెడిట్ కార్డు బిల్లు కోసం ఓ ఎడ్యుకేషన్ ట్రస్ట్ నుంచి రూ.40 లక్షలు బదిలీ అయినట్లు గుర్తించామని ఈడీ తెలిపింది. ఈ నేపథ్యంలో పరమేశ్వరకు చెందిన విద్యా సంస్థల్లో ఈడీ సోదాలు చేసింది. మనీలాండరింగ్ జరిగిందనే ఆరోపణలపై దర్యాప్తు చేస్తున్నది.

జలశక్తి శాఖలో 709 కోట్ల అవకతవకలు

న్యూఢిల్లీ, మే 23: జల, పారిశుద్ధ్య పథకాల అమలులో జలశక్తి మంత్రిత్వ శాఖలో రూ.709 కోట్లకు పైగా ఆర్థిక అవకతవకలు చోటుచేసుకున్నట్టు వెల్లడైంది. 2023-24 సంవత్సరానికి సంబంధించి నిర్వహించిన అంతర్గత ఆడిట్‌లో ఈ విషయం తేలింది. నిధుల నిలిపివేత, అనధికార వినియోగం, మెషినరీ వృథా, ప్రొక్యూర్‌మెంట్ విధాన నిబంధనల ఉల్లంఘనను ఈ నివేదిక ఎత్తిచూపింది. ఈ వార్షిక అంతర్గత ఆడిట్ సమీక్ష ప్రకారం 525.98 కోట్ల ప్రభుత్వ నిధులను వాడకుండా బ్లాక్ చేసి ఉంచారు. అటల్ బహుజల్ యోజన కింద మహారాష్ట్ర, హర్యానాలకు కేటాయించిన నిధులను పూర్తిగా ఖర్చు చేయలేదు. అలాగే కేరళ, బీహార్ రాష్ట్రాల్లో నిధుల వినియోగంలో వృథా ఖర్చులతో పాటు, కేటాయింపుల కన్నా అధికంగా వినియోగించారు. జల్‌శక్తి శాఖలో ఎస్‌బీఎం-జీ పథకం కింద 7,192 కోట్లు, అటల్ బహుజల్ యోజనకు 1,000 కోట్లు, నేషనల్ హైడ్రాలజీ పథకానికి 500 కోట్లు కేటాయించారు. కాగా, ఇంటర్నెల్ ఆడిట్ వింగ్ కూడా శాఖలో సిబ్బంది కొరత, సవాళ్లను ఎదుర్కొంటున్నదని నివేదిక పేర్కొంది.



ఉగ్రకుట్రను ముందే విచ్ఛిన్నం చేశాం

- బీఎన్ఎస్ కింద 1,37,644 కేసులు నమోదు
- మావోయిస్టులు జనజీవన స్రవంతిలోకి రావాలి
- శాంతిభద్రతలపై సమీక్షించిన డీజీపీ జితేందర్

హైదరాబాద్, మే 23 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లో ఉగ్రదాడికి ముష్కరులు పన్నిన కుట్రను భగ్నం చేశామని తెలంగాణ డీజీపీ జితేందర్ తెలిపారు. ఇటీవల విజయనగరం, హైదరాబాద్‌లో పట్టుబడిన పట్టుకున్న నిందితుల వ్యవహారంపై స్పందిస్తూ కుట్రను ముందుగానే గుర్తించామని వెల్లడించారు. అటు మావోయిస్టులు లొంగిపోయి.. జనజీవన స్రవంతిలో కలిసిపోవాలని డీజీపీ జితేందర్ పిలుపునిచ్చారు. శుక్రవారం పలు కార్యక్రమాలపై డీజీపీ సమీక్ష నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ వివిధ అంశాలపై వివరాలు వెల్లడించారు. భారతీయ న్యాయసంహిత కొత్త క్రిమినల్ చట్టాల కింద నిరుడు జులై నుంచి ఇప్పటివరకు 1,37,644 కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 1251 జీరో ఎఫ్ఐఆర్‌లు రిజిస్టర్ చేసినట్టు వెల్లడించారు. 90 రోజుల్లో చార్జిషీట్లు దాఖలు చేయాల్సిన కేసులను ఉన్నతాధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆయుధాలకు సంబంధించి 7125 లైసెన్స్‌లు జారీ కాగా, వాటితో అనుబంధంగా 9294 ఆయుధాలు ఉన్నాయని వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర స్పెషల్ పోలీస్ (టీజీఎస్పీ) సిబ్బందితో ఏర్పాటైన స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎస్‌డీఆర్ఎఫ్) బృందాల ప్రదర్శనను డీజీపీ పర్యవేక్షించారు. వరదల్లో బాధితులను కాపాడేందుకు 1,000 మంది సిబ్బంది సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఈ కార్యక్రమాల్లో డీజీ శిఖాగోయెల్, అడిషనల్ డీజీలు మహేశ్ భగవత్, వీవీ శ్రీనివాసరావు, అనిల్‌కుమార్, సంజయ్‌కుమార్‌జైన్, ఐజీలు చంద్రశేఖర్‌రెడ్డి, రమేశ్, సీపీలు సుధీర్‌బాబు, డీఐజీ రెమా రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

త్వరలో బీఆర్ఏవోయూతో సింగరేణి ఒప్పందం

హైదరాబాద్ మే 23 (నమస్తేతెలంగాణ): సింగరేణి ప్రాంతంలోని కార్మికులు, వారి కుటుంబ సభ్యులను పట్టభద్రులుగా తీర్చిదిద్దేందుకు డా బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీతో సింగరేణి యాజమాన్యం ఒప్పందం కుదుర్చుకోనున్నది. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో ఈ మేరకు యూనివర్సిటీ వీసీ ఘంటా చక్రపాణి, సింగరేణి సీఎండీ బలరాం శుక్రవారం చర్చించారు. సింగరేణి సంస్థ బోధనకు అనుకూలమైన భవనాలు కేటాయిస్తే స్టడీ సెంటర్లు ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్టు చక్రపాణి తెలిపారు. సీఎండీ బలరాం మాట్లాడుతూ మెజార్టీ కార్మికులు టెన్త్, ఇంటర్ వరకే చదువుకున్నారని, వారిని పట్టభద్రులుగా తీర్చిదిద్దేందుకు అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీతో ఒక ఒప్పందం కుదుర్చుకునేందుకు సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు.

లాభాల్లో స్టాక్ మార్కెట్లు

ముంబై, మే 23: దేశీయ స్టాక్ మార్కెట్లు తిరిగి కోలుకున్నాయి. బ్లూచిప్ సంస్థల షేర్లకు మదుపరుల నుంచి లభించిన మద్దతుతోపాటు అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలు సూచీల్లో జోష్ పెంచింది. సెన్సెక్స్ 769.09 పాయింట్లు ఎగబాకి 81,721.08 పాయింట్లకు చేరుకున్నది. నిఫ్టీ 243.45 పాయింట్లు అందుకొని 24,85 3.15 వద్ద స్థిరపడింది. ఈ వారంలో సెన్సెక్స్ 609.51, నిఫ్టీ 166.65 పాయింట్లు తగ్గాయి.

దక్షిణ మధ్య రైల్వే
Follow us on @SCRailwayindia
ద.మ. రైల్వే యొక్క టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in పై చూడవచ్చును.

ఇ-టెండరు నోటీస్ నం.018 - 2025 తేది: 22.05.2025 PUB/0599

దిగువ తెలిపిన పనుల కొరకు సీనియర్ డివిజినల్ ఇంజినీర్/ కోఆర్డినేషన్/ గుంతకల్ వారు భారత రాష్ట్రపతి తరపున ఇ-టెండర్లు కోరుతున్నారు. **ముగింపు తేది మరియు సమయం:** 17.06.2025న 15.00 గం.

క్ర.సం.01, టెండర్ నెం.Engg-GTL-West-1851, పని వివరణ: గుంతకల్ డివిజన్- SW:I: స్ప్రింగ్ షాప్‌లో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ కొరకు ఒపోక్సి ఫ్లోరింగ్ ఏర్పాటుచేయుట. SW: II: వీల్ షాప్‌లో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ కొరకు ఒపోక్సి ఫ్లోరింగ్ ఏర్పాటుచేయుట. **ప్రకటిత విలువ:** రూ.87,49,219.86, **బయానా:** రూ.1,75,000.00.

క్ర.సం.02, టెండర్ నెం.Engg-GTL-Central-1852, పని వివరణ: గుంతకల్ డివిజన్- 1) GY-PDL (SL) సెక్షన్: ADEN/GY సబ్‌డివిజన్ పరిధిలో SSE/P.way/GY అధికార పరిధిలో సెస్‌కు ప్రతిపాదిత మరమ్మతులు. 2) DHNE-GTL సెక్షన్: ADEN/DHNE సబ్‌డివిజన్ పరిధిలో SSE/P.way/DHNE అధికార పరిధిలో మరియు SSE/P.way/PDL అధికార పరిధిలో సెస్‌కు ప్రతిపాదిత మరమ్మతులు. 3) KDP-GY (DL), GY-PDL (SL): ADEN/GY సబ్‌డివిజన్ పరిధిలో SSE/P.way/KDP మరియు SSE/P.way/GY అధికార పరిధిలో శాండ్ హంప్స్ స్టాండర్డైజేషన్. **ప్రకటిత విలువ:** రూ.1,15,06,474.19, **బయానా:** రూ.2,07,500.00.

క్ర.సం.03, టెండర్ నెం.Engg-GTL-SOUTH-1853, పని వివరణ: గుంతకల్ డివిజన్- YA-NDL సెక్షన్ (SSE/ P.WAY.JMDG): ఫార్మేషన్ పటిష్టపరచుట /సెస్ రిపేర్లు-165410 Cum. **ప్రకటిత విలువ:** రూ.5,03,09,405.00, **బయానా:** రూ.4,01,600.00.

క్ర.సం.04, టెండర్ నెం.Engg-GTL-SOUTH-1854, పని వివరణ: గుంతకల్ డివిజన్- GDR-TPTY &RU-GY సెక్షన్(Sr.DEN/SOUTH/GTL): ADEN/RU సబ్‌డివిజన్ (రెండు ప్యాకెట్లు) క్రింద 77.23 కి.